క్లుప్తంగా

నేడు అష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణం రైల్వే కాలనీలో గల శ్రీసాయిదత్త ఆశ్రమంలోని అష్ట లక్ష్మి ఆలయం వార్షికోత్సవాన్ని గురువారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు గుండా శ్రీనివాస్, గుడుగుంట్ల నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చర్చిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కొండమల్లేపల్లి: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలో చర్చిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని దళితరత్న, ఆలిండియా సమతా సైనిక్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బుర్రి వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

నిడమనూరు ఎంపీడీఓ బదిలీ

నిడమనూరు: నిడమనూరు ఎంపీడీఓ కే. ప్రమోద్‌కుమార్ యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఎంపీడీఓగా ఇంకా ఎవరినీ ప్రభుత్వం నియమించలేదు. 2018 ఫిబ్రవరి 9వ తేదీన నిడమనూరు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రమోద్ కుమార్ ఆరు సంవత్సరాల పాటు మండలంలో తన సేవలు అందించారు.

హాలియా మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


మున్వర్ అలీ

హాలియా: హాలియా మున్సిపల్ కమిషనర్‌గా ఎండీ మున్వర్ అలీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన కందిమళ్ల వీరారెడ్డి బదిలీపై పోచంపల్లికి వెళ్లగా.. ఆయన స్థానంలో మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్‌లో కమిషనర్‌గా పనిచేస్తున్న ఎండీ మున్వర్ అలీ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

చందంపేట తహసీల్దార్ ..

చందంపేట: మండల తహసీల్దార్‌గా ఎం. శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రాములు బదిలీపై గట్టుప్పల్ మండలానికి వెళ్లగా... ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎం. శ్రీనివాసులు బదిలీపై ఇక్కడకు వచ్చారు.

మిర్యాలగూడ టూటౌన్ సీఐగా నాగార్జున



మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ టూటౌన్ సీఐగా పిన్నెని నాగార్జున బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ సీఐగా పనిచేసిన ఎ. నరసింహారావు హైదరాబాద్ రేంజ్ కార్యాలయానికి బదిలీ కాగా.. ఆయన స్థానంలో సైబర్ క్రైంలో పనిచేస్తున్న నాగార్జున ఇక్కడకు బదిలీపై వచ్చారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ నారాయణరెడ్డి



తిరుమలగిరి(నాగార్జునసాగర్): తిరుమలగిరి(సాగర్) మండల ఎస్ఐగా వి. నారాయణరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సురేష్ నల్లగొండ టూటౌన్‌కు బదిలీ కాగా.. సీసీఎస్‌లో ఉన్న నారాయణరెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ నారాయణరెడ్డికి పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అమర జవాన్లకు నివాళి


నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

కొండమల్లేపల్లి: పుల్వామాలో ఉగ్రవాదుల బాంబు దాడిలో మృతిచెందిన 40 మంది భారత జవాన్లకు ఏబీవీపీ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బుధవారం నివాళులర్పించారు. ఈ దాడి జరిగిన ఫిబ్రవరి 14వ తేదీని బ్లాక్ డేగా నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ కార్యదర్శి ఆకాశ్ తెలిపారు. కార్యక్రమంలో మహేశ్, గోపి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల మార్కెట్ కమిటీ పాలకమండలి రద్దు

నేరేడుచర్ల: నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలిని రద్దు చేస్తూ వ్యవసాయ శాఖ రాష్ట్ర సెక్రటరీ రఘునందన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత మార్చిలో ఏర్పాటైన మార్కెట్ పాలకమండలి ఈనెల 14వ తేదీతో ముగిసింది. నూతన పాలక మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దాతల సాయంతో 'మా ఊరి గ్రంథాలయం'

- త్వరలో ప్రారంభోత్సవం
- పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు మేలు



కొప్పోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన మా ఊరి గ్రంథాలయం

గుర్రంపోడు: పట్టణాల్లో కోచింగ్ సెంటర్లలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మండలంలోని కొప్పోలు గ్రామ యువకులు ఇటీవల పండుగ సందర్భంగా గ్రామానికి చేరుకున్నారు. తమ ఊరిలోనే గ్రంథాలయం ఉంటే అందరం ఇక్కడే కలసి చదువుకునేవాళ్లం అంటూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రయత్నం చేసి చూద్దాం అంటూ.. గ్రామంలో పశు వైద్యశాలకు నూతన భవనం నిర్మించడంతో వృథాగా ఉన్న శిథిలమైన పాత పశు వైద్యశాల రేకుల షెడ్డును ఇందుకు వినియోగించాలని అనుకున్నారు. ఈ మేరకు గ్రామ యువకులంతా కలిసి అప్పటి గ్రామ సర్పంచ్ తిరుగుడు జ్యోతీలింగారెడ్డిని కలిసి పశు వైద్యశాల భవన స్థలం ఇస్తే గ్రంథాలయ భవనాన్ని నిర్మించుకుంటామని తెలిపారు. ఇందుకు అంగీకరించిన సర్పంచ్ గ్రామ పంచాయితీ తీర్మానాన్ని ఆమోదించారు.

కస్తూరి ఫౌండేషన్ భారీ విరాళంతో పాటు..

యువకులంతా కలిసి గ్రామానికి చెందిన కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ చరణ్‌ను కలిసి ఆర్థికసాయం అందించాలని కోరారు. దీంతో ఆయన రూ.4.20లక్షల ఆర్థికసాయం అందించారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు వెల్లపూడి కరుణాకర్‌రావు రూ.50వేల స్టడీ మెటీరియల్‌ను అందించేందుకు ముందుకు వచ్చారు. గ్రామ సర్పంచ్ రూ.25 వేలు, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి రూ.30వేలు ఆర్థికసాయం అందించారు. మరికొంతమంది గ్రామస్తులు, ఇతరులు తమ శక్తి మేరకు ఆర్థికసాయం అందించారు. గ్రామం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగి పలు రంగాల్లో స్థిరపడ్డ మరికొంత మంది టేబుళ్లు, ఇతర సామగ్రిని అందించేందుకు ముందుకు వచ్చారు. ఇలా ఇప్పటి వరకు అందిన రూ.6.50లక్షలతో నూతనంగా రెండు గదులతో పాటు వరండాను నిర్మించారు. ఈ గ్రంథాలయం త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. గ్రామంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి సాయం అందించిన దాతల సాయం మరువలేనిదని సాయం అందించిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని గ్రంథాలయ నిర్మాణ కమిటీ సభ్యులు అన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి


దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దవూర: కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కే బషీర్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆయన పెద్దవూర మండల కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, మట్టపల్లి అంజిరెడ్డి, తరి రామకృష్ణ, ఊరె ప్రభాకర్, ఊరె యాదమ్మ, కాశయ్య, శ్రీను, వెంకటయ్య, శంకర్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ డీఎస్పీగా శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం : నల్లగొండ డీఎస్పీగా కె.శివరాంరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి కోదాడకు బదిలీ అయ్యారు. శివరాంరెడ్డి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సీఐగా, ఎస్ఐగా విధులు నిర్వహించారు. రాచకొండ ఏసీపీగా విధులు నిర్వహిస్తూ నల్లగొండ డీఎస్పీగా బదిలీపై వచ్చారు.

టాలెంట్ టెస్ట్ కరపత్రాల ఆవిష్కరణ

కొండమల్లేపల్లి: ఈ నెల 18న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. బుధవారం కొండమల్లేపల్లిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టడం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బి.వెంకటేశ్, చరణ్, లక్ష్మణ్, కోటేశ్, శివ, కల్యాణ్, తరుణ్, అజయ్, కుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.

దామరచర్లలో..

మిర్యాలగూడ: జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాలను బుధవారం దామరచర్ల మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో ఎంపీడీఓ కృష్ణమూర్తితో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్ననాయక్ మాట్లాడుతూ.. టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనాలనుకునే వారు దామరచర్ల ఎస్టీ గురుకుల పాఠశాలలో రూ.30 చెల్లించి హాల్‌టికెట్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ తోట నరేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, బంగారుబాబు, నరసింహ, కోటేష్, శివ, కల్యాణ్, గోపి తదితరులు ఉన్నారు.


కొండమల్లేపల్లి: టాలెంట్ టెస్ట్ కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


మిర్యాలగూడ: దామరచర్లలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీలో బుధవారం వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేముల వెంకట సాంబశివరావు, కక్కిరేణి జగదీశ్వర్, పాల్ సురేష్, పాల్ శ్యాం, సత్యనారాయణ, వెంకయ్య, రాజేశ్వర్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి గాయాలు

మర్రిగూడ: యరగండ్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్ అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యరగండ్లపల్లి గ్రామానికి చెందిన చామకూర శ్రీను మండల కేంద్రానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో మర్రిగూడ చౌరస్తా వద్ద కుక్క అడ్డురాగా తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు అటుగా వస్తున్న పోలీసు వాహనంలో మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తలకు స్వల్ప గాయాలు కావడంతో ప్రస్తుతం మర్రిగూడ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తాం

చిట్యాల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలను, విజయాలను ప్రజలకు వివరిస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. చిట్యాలలో బుధవారం నిర్వహించిన నకిరేకల్ శాసనసభ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులతో కూడిన ఐదు బృందాలతో విజయ సంకల్ప యాత్రలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫీర్ ఏక్ బార్ మోదీ సర్కార్ నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి విజయసంకల్ప యాత్రలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి వచ్చిన పగుళ్లకు బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. సమావేశంలో నకిరేకల్ నియోజకవర్గ ప్రభారి రవినాయక్, నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, జిల్లా ప్రధానకార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, జిల్లా అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు మాస శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..


మిర్యాలగూడ టౌన్: ఆదిత్య స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

దేవరకొండ: పట్టణంలోని లిటిల్ హార్ట్స్ కిండర్ గార్టెన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఆదిత్య పాఠశాలలో..

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఆదిత్య పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


దేవరకొండ: స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా వసంత పంచమి వేడుకలు


హాలియా: న్యూకిడ్స్ స్కూల్‌లో వసంత పంచమి వేడుకలు


అడవిదేవులపల్లి: గోన్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

హాలియా: పట్టణంలోని టైం స్కూల్, న్యూకిడ్స్ పాఠశాలలో వసంత పంచమిని పురస్కరించుకొని బుధవారం సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల యాజమాన్యం మందా నరేందర్‌రెడ్డి, కత్తి కోటిరెడ్డి, మనాది రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోన్యతండా, జిలకరకుంటతండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, కిశోర బాలికలు తదితరులున్నారు.


హాలియా: టైం స్కూల్‌లో సరస్వతీ అమ్మవారికి పూజలు చేస్తున్న యాజమాన్యం


కొండమల్లేపల్లి: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో వసంత పంచమిని పురస్కరించుకొని అంగన్‌వాడీ టీచర్ బూడిద జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. 25 నెలలు నిండిన బాలబాలికలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అంగన్‌వాడీ టీచర్ కోరారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త ఎం. సుజాత, బాలింతలు, ఆయా హసీనా పాల్గొన్నారు.

23న సేవాలాల్ జయంతి వేడుకలు


మిర్యాలగూడ: మాట్లాడుతున్న సేవాలాల్ బంజారా సంఘం నాయకులు

మిర్యాలగూడ: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను మిర్యాలగూడ నియోజకవర్గంలో ఈ నెల 23న నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బానావత్ రతన్‌సింగ్ నాయక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని బంజారా భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బంజారా భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి బంజారా భవన్‌లో మహాభోగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిట్టిబాబు, రవితేజ, మాన్యనాయక్, సిద్ధునాయక్, నాగునాయక్, రవినాయక్, మాలోతు దశరథ్‌నాయక్, తిరుపతి, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

పెద్దఅడిశర్లపల్లి: సంత్ సేవాలాల్ 285వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సేవాలాల్ బంజారా సంఘం మండల అధ్యక్షుడు అధ్యక్షుడు బోడ్యానాయక్ అన్నారు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ జయంతి రోజును ఐచ్ఛిక సెలవు ప్రకటించడం చాలా సంతోషకరమన్నారు. ఈ నెల 16వ తేదిన మండల కేంద్రంలో భోగ్ బండారో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవాలాల్ బంజారా సంఘం నాయకులు నారాయణ, గాసీరాం, రామచంద్రూనాయక్, భీమానాయక్, లచ్చిరాం, సీతారాం, జబ్బార్, శంకర్, దత్రునాయక్, పాండునాయక్, లక్ష్మణ్‌నాయక్, బాలకృష్ణ, కిషన్, బాబు, గోపి, శంకర్ తదితరులున్నారు.

18 నుంచి మహిళా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు

గరిడేపల్లి: శ్రీ అరవింద ధ్యాన మందిరం 52వ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని గడ్డిపల్లిలో ఈ నెల 18 నుంచి 22 వరకు నిర్వహించబోయే ఆల్ ఇండియా మహిళా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలను జయప్రదం చేయాలని గడ్డిపల్లి మాజీ సర్పంచ్ సుందరి నాగేశ్వరరావు కోరారు. బుధవారం గడ్డిపల్లిలో పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పోటీల నిర్వాహణకు సహకరిస్తున్న తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.జగదీశ్వర్ యాదవ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచదర్‌గౌడ్, నల్లగొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు రామినేని భూలోకర్‌రావు మాట్లాడుతూ జాతీయ స్థాయి క్రీడలు నిర్వహించడం అభినందనీమన్నారు. తదనంతరం క్రీడా ప్రాంగణం ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ బచ్చు ఉపేందర్, మేకల వెంకటేశ్వర్లు, బచ్చు రమేష్, రామినేని దిలీప్, కర్నం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డులు ఇవ్వాలి

నల్లగొండ టౌన్: నాలుగో తరగతి ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎనుగుల భిక్షమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్, అసోసియేట్ అధ్యక్షుడు దాస్యానాయక్, కోశాధికారి ధనరాజ్, జిల్లా కార్యదర్శి మేడి మణికుమార్, సహాధ్యక్షుడు బక్క రేణుక, కోశాధికారి సీహెచ్.సైదులు, మాజీ అధ్యక్షులు రాజమల్లయ్య, రాజయ్య, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని నాలుగో తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

రామగిరి(నల్లగొండ): ఎన్జీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో మార్చి 27,28 తేదీల్లో నిర్వహించనున్న తెలుగు నాటక సాహిత్యం సమాజం జాతీయ సదస్సు కరపత్రాన్ని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సాహిత్యం పట్ల ఆసక్తిని పెంపొందించి వారిలో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు సదస్సు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ మునీర్, డాక్టర్ అంతటి శ్రీనివాసులు, ఐక్యూఏసి వైవిఆర్ ప్రసన్నకుమార్, అకడమిక్ కో ఆర్డినేటర్ వి.శ్రీనివాసులు, సీఓఈ బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

రామగిరి(నల్లగొండ): బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నల్ల గొండ పార్లమెంట్ ఇన్‌చార్జ్ చింతల రామచంద్రరెడ్డి హాజరయ్యారు. పార్లమెంట్ ప్రబారి చాడ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నరసింహారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు

మిర్యాలగూడ: మండల పరిధిలోని అవంతీపురం గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి శాంతి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ శరత్‌బాబు, మట్టపల్లి సైదులుయాదవ్, చింతల వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

దర్వేశిపురం ఆలయంలో డీఎస్పీ ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

కనగల్: నల్లగొండ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శివరాంరెడ్డి దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానంలో ఎస్ఐ రామకృష్ణతో కలిసి బుధవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. డీఎస్పీకి ఆలయ సిబ్బంది పూలదండ వేసి, శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కనగల్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ సందర్శించి వివరాలు సేకరించారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌ను వచ్చిన డీఎస్పీని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ శాలువాతో సత్కరించారు.

10 మందికి గురుకుల ఉద్యోగాలు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో గల మేరెడ్డి రామచంద్రారెడ్డి గ్రంథాలయంలో చదువుతున్న 10 మందికి గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయని గ్రంథాలయ నిర్వాహకులు పీఎల్ఎన్ రెడ్డి, కుమ్మరికుంట్ల సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాల్లో సోమిరెడ్డి జాన్‌రెడ్డి, రాజు, సంతోష్, నాగార్జునాచారి, సైదులు, లక్ష్మి, రజియా, సుల్తానా, సరిత, సుశీల, జ్యోతిలు ఉద్యోగాలు సాధించారని అన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని ప్రత్యేకంగా అభినందించారు.

రైతు వేదికలను ఉపయోగంలోకి తీసుకురావాలి

నేరేడుచర్ల: రాష్ట్రవ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్న రైతు వేదికలను ఉపయోగంలోకి తీసుకురావాలని సీపీఐ సూర్యాపేట జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కోట్లాది రూపాయలు వెచ్చించి రైతు వేదికలను నిర్మించిన గత ప్రభుత్వం వాటిని ఉపయోగంలోకి తీసుకురాలేదని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వేదికలను రైతులు, రైతు కూలీలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.